# క్రికెట్ మ్యాచ్

పాలపర్తి జ్యోతిష్మతి

"ఏంటి ఇంత పొద్దున్నే తయారైపోయారు? ఎక్కడికైనా వెళ్ళాలా?" ఉదయం తొమ్మిదికల్లా పనులన్నీ పూర్తి చేసుకుని కూర్చున్న సుబ్బారావునూ, చింటూనూ ఉద్దేశించి అంది సుబ్బలక్ష్మి.

"కాస్త పనుందిగానీ తొందరగా టిఫెన్ పెట్టెయ్యవా" అడిగాడు సుబ్బారావు."

"ఏంటో ఆదివారం అంత ముఖ్యమైన పని" ఆరాతీసింది సుబ్బలక్ష్మి."

సుబ్బారావూ, చింటూ ముఖాలు చూసుకున్నారు. 'నేను చెప్తాలే నువ్వుండు' అన్నట్టు చింటూకి సైగచేసి "ఇవాళ ఇండియా పాకిస్తాన్ ఫిఫ్త్ అండ్ ఫైనల్ వన్ డే ఇంటర్నేషనల్ మ్యాచ్ ఉంది కదా! చూద్దామని" అన్నాడు. సుబ్బారావు.

"ఓహో! తండ్రీకొడుకు లిద్దరూ కూర్చుని టీవీ చూస్తుంటే టైంప్రకారం అన్నీ అందించాలి కాబోలు" అక్కసుగా అంది సుబ్బలక్ష్మి.

"ప్లీజ్ సుబ్బూ! ఈ ఒక్కరోజుకీ సర్దుకోవా" బ్రతిమాలాడు సుబ్బారావు.

"ఆc! పొద్దున్నించీ సాయంత్రం దాకా నడుములు పడిపోయేట్టు కూర్చుని పడీపడీ చూస్తారు కానీ మనవాళ్ళేమైనా గెలుస్తారా, పెడతారా?"

"అదేంటమ్మా, మ్యాచ్ మొదలుకాక ముందే అట్లా అనేశావు?" చింటూ అందుకున్నాడు.

"మనవాళ్ళ ప్రతిభ తెలీందేం కాదు కదా! చెరో రెండు మ్యాచ్‌లు గెలిచి సిరీస్ నువ్వా నేనా అన్నట్టు ఉంది. అందులో ప్రత్యర్ధి పాకిస్తాను. అంతగట్టిగా నిలబడి గెలిచేంత ఆత్మస్థైర్యం మనవాళ్ళ కుంటుందా? ఎన్నిసార్లు చూడలేదు?"

"అట్లా అనకు సుబ్బూ! ఈసారి మనవాళ్ళు ఖచ్చితంగా గెలుస్తారు."

"అంతరూఢిగా ఎట్లా చెప్పగలరో!"

"దేశమంతా అదే కోరుకుంటోంది. నువ్వొక్కదానివే ఇట్లా మాట్లాడుతున్నావు."

"దేశమంతా ఏం కోరుకుంటే అది జరిగిపోతుందా?"

"అందరి దృష్టీ వాళ్ల మీదే ఉంటుంది కాబట్టి, అందరూ తమ ఆట చూస్తున్నారని వాళ్ళకి తెలుసు కాబట్టి మన దగ్గర్నించీ థాట్ వైబ్రేషన్స్ వాళ్ళకి చేరి బాగా ఆడేటట్టు చేస్తాయి." పెద్ద సిద్ధాతం బోధిస్తున్నట్టు చెప్పాడు చింటూ.

"మీ తిప్పలు మీరు పడండి" అంటూ విసవిసా లోపలి కెళ్ళిపోయింది సుబ్బలక్ష్మి.

వేడివేడి పూరీలు పళ్ళాల్లో పెట్టుకుని వచ్చిన సుబ్బలక్ష్మిని చూసి "మీ అమ్మ మాట కరుకుగానీ మనసు వెన్నరా" అన్నాడు సుబ్బారావు చింటూతో.

"ఈ మాటలకేం లెండి" అంటూ ముసిముసిగా నవ్వుతూ ముద్దుగా విసుక్కుంది సుబ్బలక్ష్మి.

ఇంతలో చింటూ "య్యస్స్సు..." అని అరిచాడు.

"ఏమైందిరా" అడిగాడు సుబ్బారావు.

"టాస్ పాకిస్తాన్ వాళ్ళు గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నారు" చెప్పాడు చింటూ.

"దాని కంత సంతోషమెందుకు బాబూ? టాస్ దగ్గర కూడా మనవాళ్ళకి అదృష్టం లేదు" వెటకారంగా అంది సుబ్బలక్ష్మి.

"టాస్ కలిసిరాకపోయినా పాకిస్తాన్ వాళ్ళు తెలివితక్కువగా బ్యాటింగ్ తీసుకున్నారు. మన వాళ్ళు ఫస్ట్ బ్యాటింగ్ కంటే సెకండ్ బ్యాటింగ్ బాగా ఆడతారు తెలుసా?" ఆరిందాలా చెప్పాడు చింటూ.

"అవునవును. ఇవాళ జయం మనదే" అన్నాడు సుబ్బారావు.

"అబ్బో! అన్నీ మీకే తెలుసు, నాకేమీ తెలీదు." అంటూ మూతి మూడు వంకర్లు తిప్పి వంటింట్లో కెళ్ళిపోయింది సుబ్బలక్ష్మి.

"అమ్మా! వాళ్ళు లంచ్‌కెళ్ళేటప్పటికీ మన భోజనం కూడా తయారైపోవాలి. మళ్ళీ వాళ్ళు ఆట కొచ్చేటప్పటికి టీవీ ముందు కూర్చోవాలి మనం." కేకేశాడు చింటూ.

"మనం ఎందుకులే! మీరు కూర్చోండి చాలు" లోపల్నించే చిరాకు పడింది సుబ్బలక్ష్మి.

వంట ధ్యాసలో పడి ఆట గురించి పట్టించుకోలేదు సుబ్బలక్ష్మి. వంట పూర్తిచేసి బయటికి వచ్చేటప్పటికి పాకిస్తాన్ వాళ్ళ ఆట పూర్తయ్యింది.

"ఏమైంది?" అడిగింది.

"అయిదు వికెట్లకి మూడొందల ఇరవై నాలుగు కొట్టారు. అంటే మనవాళ్ళు మూడొందల ఇరవై ఐదు కొట్టి గెలవాలి." వివరించాడు చింటూ.

"అయినట్టే. అంత స్కోరు చూసేటప్పటికే మన వాళ్ళకి గుండెలు జారిపోతాయి. ఇంక ఆడినట్టే. మీరు భోజనాలకి రండి."

భోజనం పూర్తవగానే టీవీ పెట్టి "రామ్మా చూద్దాం" అని పిలిచాడు చింటూ.

"మీకు పనేం లేదు కాబట్టి చూస్తారు. నేను పొద్దున్నించీ పని చేసిచేసి అలసిపోయాను. నా కోపిక లేదు. నేను కాసేపు పడుకోవాలి" అంటూ పడగ్గదిలో కెళ్ళిపోయింది సుబ్బలక్ష్మి.

నిద్రలేచి సుబ్బలక్ష్మి బయటికి రాగానే "సుబ్బూ! ఆట మంచి రసపట్టులో ఉంది. వేడివేడిగా పకోడీలు చెయ్యరాదూ" అన్నాడు సుబ్బారావు.

"ఎట్లా ఆడుతున్నారేమిటి?"

"వంద కొట్టారు."

"ఎన్ని ఓవర్లయ్యాయి?"

"ఇరవై."

"వికెట్లెన్నిపడ్డాయో?"

"ఐదు."

"హుc! వాళ్ళు యాభై ఓవర్లాడి ఐదు వికెట్లు పోగొట్టుకుంటే ఇరవై ఓవర్లకే మనవాళ్ళు ఐదు వికెట్లు సమర్పించుకున్నారు. ఇంకా ముప్పై ఓవర్లలో రెండొందల ఇరవై ఐదు పరుగులు తియ్యాలి. అంటే... ఓవరుకి ఏడు పరుగుల పైన కావాలి, అదీ వికెట్లు నిలిస్తే. గెలిచినట్టే."

"టెండూల్కర్ ఉన్నంత వరకూ మనకేం భయంలేదమ్మా."

"ఆc! ఎంతసేపూ ఆ టెండూల్కర్‌నే పట్టుకుని వేళ్ళాడుతుంటారు. కుర్రాళ్ళంతా వెంటవెంటనే పడిపోతుంటే ఆ ముసలాడు గెలిపిస్తాడా?"

# భట్టిప్రోలు నాగసుందరి స్మారక సంక్రాంతి కథానిక పోటీ

- పోటీల్లో గెలుపొందిన కథా రచయితలకు ప్రథమ బహుమతిగా రూ.1500/-లు, ద్వితీయ బహుమతిగా రూ.1000/-లు, తృతీయ బహుమతిగా రూ.500/-లు, కన్సొలేషన్ బహుమతులు (2×250) ఇవ్వబడును.
- కథ నిడివి అచ్చులో ఒక పేజీకి మించరాదు.
- రచయిత వివరాలు కథపై కాకుండా వేరే కాగితంపై పొందుపరచవలెను.
- హామీపత్రం (ఈ కథ తన స్వంతరచన అని, దేనికి అనుకరణగాని, అనువాదం గాని కాదని, ఇంతవరకు ఈ కథ ప్రచురింపబడలేదని, ఏ యితర పత్రికలకు గాని, శ్రవ్య, దృశ్య మాధ్యమాలకు గాని పంపలేదని ధృవీకరణ పత్రం జతపరచాలి.
- కథలు చేరవలసిన ముగింపు తేదీ : **15 డిసెంబరు 2010**
- కవరుపై 'సంక్రాంతి కథానికల పోటీ' కి అని ఉదహరించాలి.

**ఈ కథానికల పోటీలకు ప్రముఖ కథకులు, అనువాదకులు శ్రీ ఎల్.ఆర్.స్వామి, విశాఖపట్నం వారు స్పాన్సర్ చేస్తున్నారు.**

చినుకు మాసపత్రిక
3వ అంతస్తు, దత్తాస్ నయాబజార్
రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా, గాంధీనగర్
విజయవాడ - 520 003.
Ph : 0866-6640595 Cell : 98481 32208
E-mail : editor_chinuku@yahoo.com &
editor.chinuku@gmail.com

"అమ్మా! టెండూల్కర్‌ని ఏమన్నా అంటే నేనూరుకోను" కోపంగా అరిచాడు చింటూ.

"మీ అమ్మ ఎప్పుడూ ఇంతేరా! కాస్త కూడా పాజిటివ్‌గా మాట్లాడదు.'' రుసరుసలాడాడు సుబ్బారావు.

"మేమెట్లాగో గెలిపిస్తాంలే, నువ్వెళ్ళి పకోడీలు చెయ్యి" వంటింటివైపు చెయ్యి చూపిస్తూ అన్నాడు చింటూ.

"ఆఁ! చేస్తాను. నేనున్నది అందుకేగా? ఆజ్ఞాపించండి" ఉక్రోషంగా అని లోపలికెళ్ళింది సుబ్బలక్ష్మి.

"ఏమైంది?" అడిగింది.

"టెండూల్కర్ రనౌటని అప్పీల్ చేశారు" చెప్పాడు సుబ్బారావు.

"ఇంకేముంది? ఆట అయిపోయినట్టే. లేవండి, లేచి పనులు చూసుకోండి." ఎగతాళిగా అంది సుబ్బలక్ష్మి.

"అవుటు కాదమ్మా, వచ్చేశాడు. అయినా రీప్లే చూసి చెప్తారు కదా! తొందరపడతావెందుకు?"

ఆట మళ్ళీ చూపిస్తున్నారు.

"వచ్చేశాడు" కంగారుగా అన్నాడు చింటూ.

మళ్ళీ ఇంకోసారి చూపించారు. మళ్ళీ "వచ్చేశాడు, వచ్చేశాడు" అన్నాడు చింటూ.

"నువ్వెన్నిసార్లు ఎంత గట్టిగా చెప్పినా వాళ్ళకి వినిపించదులే. ఎగిరెగిరి పడకుండా కూర్చుని చూడు" అంది సుబ్బలక్ష్మి.

ఇంతలో 'నాటవుట్' అన్న అక్షరాలు టీవీ తెరమీది కొచ్చాయి. చప్పట్లు కొట్టాడు చింటూ.

"ఆ నూనె ఇల్లంతా కారుతుంది. అక్కడ పకోడీలు మాడిపోతాయి. నువ్వెళ్ళు" అన్నాడు సుబ్బారావు.

పకోడీలు పళ్ళాల్లో సర్ది తీసుకొచ్చింది సుబ్బలక్ష్మి.

'కూర్చో, చూడు' అన్నాడు సుబ్బారావు.

"నాకు ఆ ఆట మీద అంత ఆసక్తే లేదు" అంటూ వీధిలో కెళ్ళిపోయింది సుబ్బలక్ష్మి. ఇరుగు పొరుగులతో కబుర్లు పూర్తిచేసుకుని లోపలికొచ్చి కూర్చుంటూ అడిగింది "ఎంతదాకా వచ్చారు?" అని.

"ఆఖరి ఓవర్. ఆరు బంతులకి ఎనిమిది పరుగులు తీస్తే గెలుస్తారు. తొమ్మిది వికెట్లు పోయాయి. టెండూల్కర్ ఉన్నాడు. నూటయాభై కొట్టాడు." గబగబా చెప్పేసి టీవీకి కళ్ళు అతికించేశాడు చింటూ.

ఏదో అనబోయి సుబ్బారావు, చింటూల ముఖాల్లోని ఉత్కంఠ చూసి మాట్లాడకుండా ఊరుకుంది సుబ్బలక్ష్మి.

మొదటి నాలుగు బంతులకి ఒక్కొక్క పరుగు వచ్చాయి. అయిదో బంతికి పరుగులేమీ రాలేదు.

"ఈ బంతిని బౌండరీ దాటిస్తేనే గెలిచేది" ఉడికిస్తూ అంది సుబ్బలక్ష్మి.

"ఎక్స్‌ట్రా రన్స్ కూడా రావచ్చు."

అబ్బో ఎంత ఆశో!"

బంతి విసరడానికి ఆటగాడు పరుగు తీస్తున్నాడు.

సుబ్బారావు, చింటూ కుర్చీల్లో అస్థిమితంగా కదులుతున్నారు.

వేగంగా వస్తున్న బంతిని వీరబాదుడు బాదాడు టెండూల్కర్. అది ఎగిరి వెళ్ళి ప్రేక్షకుల మధ్య పడింది.

"సిక్సర్ అని చింటూ, "గెలిచారు" అని సుబ్బారావూ అరిచారు.

"నాకు ముందే తెలుసు మనవాళ్ళు గెలుస్తారని. మొదటి ఓవర్ నుంచీ చివరి ఓవర్ దాకా టెండూల్కర్ చెమటోడ్చి ఆడి నూటయాభై దాటాక గెలవకేం చేస్తారు?" అంది సుబ్బలక్ష్మి.

సుబ్బారావూ, చింటూ నోరు తెరుచుకుని చూస్తూ ఉండిపోయారు. కాసేపటికి తేరుకున్న సుబ్బారావు "అదేంటి సుబ్బూ అట్లా ప్లేటు ఫిరాయించేశావు?" అన్నాడు.

"అందరూ గెలుస్తారు, గెలుస్తారు అంటుంటే దిష్టి తగలదూ? దిష్టి కొట్టెయ్యడానికే నేనట్లా మాట్లాడాను" అంటూ ఖాళీ పళ్ళాలు తీసుకుని లోపలి కెళ్ళిపోయింది సుబ్బలక్ష్మి.